క్లుప్తంగా

బాధితులకు పరామర్శ



శాయంపేట : మండల కేంద్రానికి చెందిన మామిడి శ్రీనివాసులు ఆదివారం రాత్రి గుండెపోటుతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న మాజీ స్పీకర్, ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదనాచారి సోమవారం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. అనంతరం కొత్తగట్టు సింగారం గ్రామానికి చెందిన తోట శరభందం అనారోగ్యంతో బాధపడుతుండగా పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. ఆయన వెంట నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

బీజేపీని ఆదరించాలి

శాయంపేట : పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి అరూరి రమేష్‌ను ఆదరించి గెలిపించాలని ఆ పార్టీ మండల కోఆర్డినేటర్ నరహరిశెట్టి రామకృష్ణ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని 306 బూత్‌లో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. నరేంద్రమోదీని మూడోసారి ప్రధానమంత్రిని చేసే బాధ్యత ప్రతీఒక్కరిపై ఉందన్నారు. మోదీతోనే దేశాభివృద్ధి సాధ్యమన్నారు. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ 5నెలలు గడుస్తున్నా ఆరు గ్యారంటీలను అమలు చేయకుండా కాలయాపన చేస్తోందన్నారు. కల్యాణలక్ష్మి పథకం ద్వారా లక్ష రూపాయలు, తులం బంగారం, నిరుద్యోగులకు భృతి, రైతులకు రైతుబంధు ఇవ్వకుండా మోసం చేస్తోందని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో ఓబీసీ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు ఉప్పు రాజు, బూత్ అధ్యక్షుడు బాసాని నవీన్, కడారి చంద్రమౌళి, కిసాన్ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు కానుగుల నాగరాజు, నాయకులు విద్యాసాగర్, రాజశేఖర్, సుమన్ పాల్గొన్నారు.

కావ్య గెలుపు ఖాయం

దామెర: పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి కడియం కావ్య విజయం సాధించడం ఖాయమని ఆ పార్టీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ పాలెపాక శ్రీనివాస్ అన్నారు. పరకాల పట్టణంలో సోమవారం నిర్వహించిన ఎన్నికల సన్నాహక సమావేశానికి మండల కేంద్రం నుంచి యూత్ కాంగ్రెస్ నాయకులు తరలివెళ్లారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ జెండాఊపి ర్యాలీని ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో రాష్ట్రాభివృద్ధి సాధ్యమని అన్నారు. యువత కాంగ్రెస్ పార్టీకి అండగా నిలవాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి కావ్య గెలుపునకు కార్యకర్తలు, నాయకులు కష్టపడి పనిచేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి దుర్శెట్టి భిక్షపతి, మండల యూత్ అధ్యక్షుడు నల్ల సుధాకర్, మాజీ ఉపసర్పంచ్ హింగె నాగేశ్వర్ రావు, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

గురుకుల పాఠశాలకు ఎంపిక



ఐనవోలు : మండలంలోని పున్నేలు ప్రభుత్వ పాఠశాలలో నాల్గో తరగతి చదువుతున్న విద్యార్థులు కంజర్ల వాత్సల్య, చాగంటి ప్రిన్సీ హనుమకొండలోని ప్రభుత్వ గురుకుల పాఠశాలలో ఐదోతరగతి చదివేందుకు అర్హత సాధించినట్లు హెచ్ఎం రాయరాకుల పరమేశ్వర్ తెలిపారు. ఈ మేరకు సోమవారం పాఠశాలలో ఎంపికైన విద్యార్థులకు అర్హత సర్టిఫికెట్లను అందించారు. ఉపాధ్యాయులు వసంత, యాకయ్య, కొమురయ్య, ఇందిరా, స్వప్న, నరేందర్ విద్యార్థులను అభినందించారు.

108 సిబ్బందికి అవార్డుల ప్రదానం



పరకాల : ప్రాణపాయస్థితిలో ఉన్న వృద్ధుడిని కాపాడిన పరకాల 108–ఈఎంఆర్ఐ సిబ్బందికి 2023–24 సంవత్సరానికి ఉత్తమసేవ అవార్డు లభించింది. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా 108 ఈఎంఆర్ఐ గ్రీన్ హెల్త్ సర్వీస్ ఆధ్వర్యంలో ఉత్తమ సేవలు అందించిన వారిని గుర్తించి అవార్డులు అందించారు. అందులో భాగంగా 2023 నవంబర్ మాసంలో నడికూడ మండలం కంఠాత్మకూర్ గ్రామానికి చెందిన 65 ఏళ్ల వృద్ధుడు ఇంట్లో ఏవరులేని సమయంలో కత్తితో పొడుచుకొని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. సమాచారం అందిన వెంటనే 108 సిబ్బంది ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్ వక్కల సంజీవ్, పైలట్ పాముల రాజు సంఘటన స్థలానికి చేరుకొని తీవ్ర రక్తస్రావంలో పడిపోయిన వృద్ధుడికి ప్రథమ చికిత్స చేసి కాపాడారు. దింతో ఇరువురికి సోమవారం హైదరాబాద్‌లో జరిగిన 108 ఈఎంఆర్ఐ గ్రీన్ హెల్త్ సర్వీసెస్ సమావేశంలో డైరెక్టర్ డాక్టర్ వెంకటేష్, స్టేట్ ఆపరేషన్ హెడ్ ఖలీద్ చేతుల ఉత్తమ సేవ అవార్డులు ప్రదానం చేశారు. అవార్డులు అందుకున్న ఇరువురిని వరంగల్ ఉమ్మడి జిల్లా ప్రోగ్రామ్ మేనేజర్ శివకుమార్, జిల్లా ఇంచార్జి లక్ష్మణ్ అభినందించారు.

ప్రభుత్వ పాఠశాలలో పుట్టెడు సమస్యలు

- పూర్తికాని డైనింగ్ హాల్ నిర్మాణం
- అధ్వానంగా మరుగుదొడ్లు
- ప్రహరీ లేక తీవ్రఇబ్బందులు
- అపరిశుభ్ర వాతావరణంలో విద్యార్థుల భోజనం
- పాఠశాల ఆవరణలోనే ఎంపీడీఓ కార్యాలయం, నర్సరీల ఏర్పాటు

వేలేరు : మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాల ఇది. దివంగత మాజీ ప్రధాని పీవీ నరసింహారావుతో పాటు ఎంతో మంది మేధావులను, రాజకీయ నాయకులను, డాక్టర్లు, ఇంజనీర్లను ఇలా ఎంతో మంది గొప్పవాళ్లను తయారు చేసిన ప్రభుత్వ పాఠశాల.. నేడు సమస్యలతో సతమతమవుతోంది.



తుప్పు పట్టి విరిగిన వేలేరు ప్రభుత్వ పాఠశాల మరుగుదొడ్ల తలుపులు



పాఠశాల ఆవరణలో డ్రైయినేజీ



అసంపూర్తిగా డైనింగ్ హాల్ నిర్మాణం

విరిగిన డోర్లు..

మరుగుదొడ్లలో నీటి సౌకర్యం లేకపోవడంతో అపరిశుభ్రంగా మారాయి. డోర్లు తుప్పు పట్టి విరిగిపోయి ఉండటంతో విద్యార్థులు, మహిళా టీచర్లు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పాఠశాల ప్రాంగణంలో గ్రామపంచాయతీ డ్రెయినేజీ ఉండటంతో గ్రామంలోని అపరిశుభ్రమైన నీళ్లు పాఠశాల ప్రాంగణంలోనే నిలిచి దుర్వాసన వెదజల్లుతోంది. గత ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మిషన్ భగీరథ నల్లా కనెక్షన్ ఏర్పాటు చేయకపోవడంతో విద్యార్థులకు తాగునీటి ఇబ్బందులు తప్పడం లేదు. మన ఊరు– మన బడి పథకంలో భాగంగా పాఠశాలలో డైనింగ్‌హాల్ నిర్మాణానికి రూ.14.50 లక్షలు కేటాయించగా సంబంధిత కాంట్రాక్టర్ పిల్లర్లు పోసి గోడలు నిర్మించాడు. అనంతరం బిల్లులు రావడంలేదని నిర్మాణ పనులు మధ్యలోనే వదిలేశాడు. దీంతో అసంపూర్తిగా మారింది.



రోడ్డు మరమ్మతులో భాగంగా కూల్చిన ప్రహరీ

ఆకతాయిలకు అడ్డాగా..

మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాల ప్రహరీ డబుల్ రోడ్డు నిర్మాణంలో భాగంగా గ్రామానికి చెందిన కొంతమంది ప్రజాప్రతినిధుల ప్రోద్బలంతో విద్యాశాఖ అధికారుల అనుమతి లేకుండానే ప్రహరీ కూల్చివేసి రోడ్డు వేశారు. మెయిన్ రోడ్డును ఆనుకుని ఈ పాఠశాల ఉండటంతో విద్యార్థులు ఇంటి నుంచి వెళ్లింది మొదలు సాయంత్రం ఇంటికి చేరే వరకు ఏప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. కొంత మంది ఆకతాయిలు పాఠశాలలోకి ప్రవేశించి మద్యం సేవించి ఖాళీ సీసాలను ఆ పరిసరాల్లోనే వదిలి వెళ్తున్నారు. ప్రభుత్వ పాఠశాలకు ప్రహరీ నిర్మించాలని విద్యార్థులు కోరుతున్నారు.



పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన ఎంపీడీఓ కార్యాలయం, నర్సరీ

పాఠశాల ఆవరణలో ప్రభుత్వ కార్యాలయాలు

పాఠశాల ఆవరణలోనే మండల ప్రజాపరిషత్ కార్యాలయం, నర్సరీలు, గ్రామీణ క్రీడా మైదానం ఏర్పాటు చేశారు. దీంతో ప్రశాంతమైన వాతావరణంలో విద్యను అభ్యసించాల్సిన విద్యార్థులు చదువుపై దృష్టి సారించలేకపోతున్నారు. పాఠశాల ఆవరణలోనే ఉన్న మండల ప్రజాపరిషత్ కార్యాలయానికి వివిధ పనుల నిమిత్తం ప్రజలు నిత్యం వస్తుంటారు. వివిధ వాహనాల్లో పదుల సంఖ్యలో కార్యాలయానికి రావడంతో విద్యార్థుల దృష్టి అటువైపు మళ్లుతోంది. ఉన్నతాధికారులు దృష్టి సారించి సమస్యలు పరిష్కరించాలని విద్యార్థులు కోరుతున్నారు.

కార్యాలయాలు తరలించాలి



పాఠశాల ప్రాగణంలోని ఎంపీడీఓ కార్యాలయం, నర్సరీ, గ్రామీణ క్రీడా మైదానాన్ని ఇతర చోటుకి తరలించాలి. వివిధ సమస్యల పరిష్కారానికి పదుల సంఖ్యలో కార్యాలయానికి ప్రజలు వస్తున్నారు. దీంతో విద్యార్థులు చదువుపై ఏకాగ్రత వహించలేకపోతున్నారు. మూత్రశాలలు సరిగా లేకపోవడంతో విద్యార్థినులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వెంటనే మరమ్మతులు చేపట్టాలి.

– బంక శ్రీనివాస్, విద్యార్థి సంఘం నాయకుడు, వేలేరు

రోడ్డు ప్రమాదంలో తల్లి, కొడుకుకు గాయాలు



ఆత్మకూరు : రోడ్డు ప్రమాదంలో తల్లి, కొడుకు తీవ్ర గాయాల పాలయ్యారు. ఈ సంఘటన సోమవారం కటాక్షపూర్ శివారు జాతీయ రహదారిపై చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. వరంగల్‌కు చెందిన ఉప్పు వెంకటమ్మ, కుమారుడు బాబు ద్విచక్ర వాహనంపై వరంగల్ నుంచి ములుగుకు వెళ్తున్నారు. కటాక్షపూర్ శివారులో ఓ పెట్రోల్‌బంక్‌లో పెట్రోల్ పోసుకొని రోడ్డెక్కారు. ఈ క్రమంలో రోడ్డుపై ఓ వ్యక్తి నిర్లక్ష్యంగా ద్విచక్ర వాహనం నిలపడంతో వెనుక నుంచి వస్తున్న వీరి ద్విచక్ర వాహనం అదుపుతప్పి ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు గమనించి హుటాహుటిన 108లో ఆస్పత్రికి తరలించారు. క్షతగాత్రుల పరిస్థితి విషయమంగా ఉన్నట్లు సమాచారం.

నియామకంపై హర్షం

కమలాపూర్ : బీజేపీ హనుమకొండ జిల్లా ఓబీసీ మోర్చా, కిసాన్ మోర్చా కమిటీల్లో కమలాపూర్ మండలానికి చెందిన పలువురికి అవకాశం కల్పించడం హర్షించదగిన విషయమని బీజేపీ మండల అధ్యక్షుడు అశోక్‌రెడ్డి తెలిపారు. బీజేపీ ఓబీసీ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడిగా చెందిన కనుకుంట్ల అరవింద్, కిసాన్ మోర్చా జిల్లా ప్రధానకార్యదర్శిగా బండి కోటేశ్వర్, ఓబీసీ మోర్చా జిల్లా కార్యవర్గ సభ్యుడిగా పోతిరెడ్డి నవీన్, కిసాన్ మోర్చా జిల్లా కార్యవర్గ సభ్యులుగా మాటం రమేష్‌బాబు, గూడూరు ప్రసాద్‌ను నియమించడం సంతోషకరమని తెలిపారు. జిల్లా అధ్యక్షురాలు రావు పద్మ, ఓబీసీ మోర్చా, కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షులు పూర్ణాచారి, సారయ్యకు కృతజ్ఞతలు తెలిపారు.

సాదాసీదాగా సర్వసభ్య సమావేశం

- హాజరుకాని సభ్యులు

ధర్మసాగర్ : మండల కేంద్రంలోని ప్రజా పరిషత్ కార్యాలయంలో వైస్ ఎంపీపీ బండారి రవీందర్ అధ్యక్షతన సోమవారం జరిగిన సర్వసభ్య సమావేశం సాదాసీదాగా కొనసాగింది. ముందుగా వివిధ శాఖల అధికారులు నివేదికను చదివి వినిపించారు. అనంతరం వైస్ ఎంపీపీ రవీందర్ మాట్లాడుతూ.. గ్రామాల్లో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా చూడాలని అధికారులకు సూచించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఇబ్బందులు కలుగకుండా సమయానికి అనుగుణంగా కాంటా వేసి కొనుగోలు చేసి డబ్బులు సకాలంలో చెల్లించాలని అన్నారు. అలాగే అమ్మ ఆదర్శ పాఠశాలల్లో మౌళిక వసతుల కల్పనకు అధికారులు తగిన చర్యలు చేపట్టాలన్నారు. ఐకేపి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను పర్యవేక్షించాలని అధికారులను కోరారు. కాగా మండలంలో మొత్తం 14 మంది ఎంపీటీసీ సభ్యులు ఉండగా కేవలం 5 మంది సభ్యులు మాత్రమే హాజరయ్యారు. దీంతో సమావేశంలో ఖాళీ కుర్చీలు కనిపించాయి. ఈ సమావేశంలో ఎంపీడీఓ అనీల్‌కుమార్, ఎంపీఓ కరుణాకర్‌రెడ్డి, వివిధ గ్రామాల ఎంపీటీసీలు, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.



సభ్యులు గైర్హాజరు కావడంతో ఖాళీగా ఉన్న కుర్చీలు

విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు



మాట్లాడుతున్న ఎంపీడీఓ

పరకాల : విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించే సిబ్బందిపై చర్యలు తీసుకుంటామని ఎంపీడీఓ, మల్లక్‌పేట గ్రామ ప్రత్యేకాధికారి పెద్ది ఆంజనేయులు అన్నారు. సోమవారం మల్లక్‌పేట గ్రామంలో సమావేశం నిర్వహించగా గ్రామస్తులు పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకువచ్చారు. సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని ఎంపీడీఓ తెలిపారు. గ్రామపంచాయతీ సమావేశానికి హాజరుకాని అధికారులు, ఉద్యోగులపై చర్యలు తీసుకునే విధంగా ఉన్నతాధికారులకు లిఖితపూర్వకంగా తెలియజేయనున్నట్లు తెలిపారు. పంచాయతీకార్యదర్శి శైలజ, ఏపీఓ ఇందిరా, పాఠశాల హెచ్ఎం వీరస్వామి, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

కేంద్రంలో అధికార పీఠం కాంగ్రెస్ పార్టీదే

- ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి

పరకాల : పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అత్యధిక సీట్లు గెలిచి కేంద్రంలో అధికారంలోకి రానుందని కాంగ్రెస్ వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జ్, పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి జోస్యం చెప్పారు. అసెంబ్లీ ఎన్నికల్లో హామీ ఇచ్చిన ఆరు గ్యారంటీల్లో ఇప్పటికే 5 గ్యారంటీలను అమలు చేశామని, మిగతా హామీలను అమలు చేసే దిశగా ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. పట్టణంలో సోమవారం నిర్వహించిన వరంగల్ పార్లమెంట్ యూత్ కాంగ్రెస్ సన్నాహక సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. యువకుల బలిదానాలను చూసిన సోనియాగాంధీ తెలంగాణ ప్రత్యేక రాష్ట్రాన్ని ఇచ్చారని అన్నారు. కానీ సెంటిమెంట్‌ను వాడుకొని కేసీఆర్ సీఎం కుర్చీ ఎక్కి నీళ్లు, నిధులు, నియామకాలను గాలికొదిలేసి దోచుకుని దాచుకుంటూ రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చారని విమర్శించారు. 10 ఏళ్ల కేసీఆర్ పాలనలో అవినీతి, అక్రమాలు తప్ప అభివృద్ధి చేసిందేమి లేదన్నారు. అనంతరం కాంగ్రెస్ వరంగల్ పార్లమెంట్ అభ్యర్థి కడియం కావ్య మాట్లాడుతూ.. తాను గెలిస్తే ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పెంపొందించడానికి కృషి చేస్తానని అన్నారు. కుడా చైర్మన్ వెంకట్రామ్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే భిక్షపతి, కాంగ్రెస్ నాయకులు శ్రీనివాసాచారి, కల్పనాదేవి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రేవూరి ప్రకాశ్‌రెడ్డి

కాంగ్రెస్‌లో చేరికలు

బీఆర్ఎస్ నుంచి సస్పెండ్ అయిన మడికొండ శ్రీనుతో పాటు 1వ వార్డు కౌన్సిలర్ మడికొండ సంపత్, పరకాల పీఏసీఎస్ మాజీ చైర్మన్ రమేష్, రైతు సమన్వయ సమితి వరంగల్ జిల్లా మాజీ కన్వీనర్ సోమవారం కాంగ్రెస్‌లో చేరారు. . మాజీ ఎమ్మెల్యే భిక్షపతి, నాయకుడు రామకృష్ణ ఆధ్వర్యంలో చేరగా ఎమ్మెల్యే ప్రకాశ్‌రెడ్డి కండువా కప్పి ఆహ్వానించారు.

అభయాంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠాపన



పులుకుర్తిలో శోభాయాత్ర నిర్వహిస్తున్న భక్తులు

దామెర : మండలంలోని పులుకుర్తిలో అభయాంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవం సోమవారం అంగరంగ వైభవంగా ప్రారంభించినట్లు హనుమాన్ ఆలయ కమిటీ చైర్మన్, మాజీ ఉపసర్పంచ్ మెంతుల రాజు తెలిపారు. డప్పుచప్పుళ్ల నడుమ శోభాయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని మహిళలు కుండలతో మంచినీటిని తీసుకొచ్చి అభిషేకం నిర్వహించి, మంగళహారతులతో స్వాగతం పలికారు. అనంతరం స్వస్తి పుణ్యాహవాచనం, రక్షాబంధనం, దీక్షా స్వీకరణ, జల, ఫల, పుష్ప, ధ్యానాధివాసం, మృత్యుంగ్రహణం, నివేదన, అంకురార్పణ, తీర్థప్రసాద వితరణ కార్యక్రమాలను వేద పండితుల మంత్రోచ్ఛరణల నడుమ వైభవంగా జరిగాయి. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ.. మంగళవారం ఉదయం 7 గంటల నుంచి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం స్వామివారి విగ్రహ ప్రాణప్రతిష్ఠాపన కార్యక్రమం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి, రెడ్‌క్రాస్ జిల్లా చైర్మన్ పెసరు విజయ్‌చందర్‌రెడ్డి, ప్రముఖ వైద్యులు సిరంగి సంతోష్, పిన్నోజు సుబ్రమణ్యచారి, భాను శ్రీనివాసచారి, మునిగాల సురేందర్‌రావు తదితరులు హాజరుకానున్నట్లు తెలిపారు. కార్యక్రమానికి భక్తులు అధిక సంఖ్యలో హాజరై స్వామివారి కృపకు పాత్రులు కావాలని కోరారు. మాజీ సర్పంచ్ గోవిందుఅశోక్, ఎంపీటీసీ గోవిందు సంధ్యఅశోక్, భజన మండలి సభ్యులు సతీష్, మహేష్, చంద్రమోహన్, కిరణ్, చిరంజీవితో పాటు గ్రామ పెద్దలు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ వృత్తి గౌరవప్రదమైనది

- ఎంఈఓ రమాదేవి

పరకాల : సమాజంలో ఉపాధ్యాయ వృత్తి గౌరవప్రదమైనదని మండల విద్యాశాఖాధికారిణి ఎస్.రమాదేవి అన్నారు. పట్టణంలోని వెలమవాడ ఎంపీపీఎస్ ప్రధానోపాధ్యాయురాలు నేరేళ్ల రమాదేవి ఉద్యోగవిరమణ సన్మానోత్సవం సోమవారం జరిగింది. పాఠశాల ఇన్‌చార్జ్, ప్రధానోపాధ్యాయురాలు జి.శంకర్ అధ్యక్షత వహించగా రమాదేవి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. వృత్తిలో అంకితభావంతో పనిచేసిన వారికి సమాజంలో మంచి గుర్తింపు లభిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో పీఆర్‌టీయూ టీఎస్ పరకాల మండల అధ్యక్షుడు మోడెం రాజేందర్‌బాబు, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు దగ్గు తిరుపతిరావు, మండల ప్రధానకార్యదర్శి గొల్ల రాజ్‌కుమార్, పాఠశాల ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.



రమాదేవిని సన్మానిస్తున్న ఎంఈఓ, పీఆర్‌టీయూ(టీఎస్) నాయకులు

కాలుష్య నియంత్రణ అందరి బాధ్యత

శాయంపేట : పర్యావరణానికి హాని కలిగిస్తున్న కాలుష్యాన్ని నియంత్రించాల్సిన బాధ్యత అందరిపై ఉందని ప్రజ్వల్ ఎఫ్‌పీసీఎల్ ఫీల్డ్ ఫెసిలీటర్ కల్పన అన్నారు. సోమవారం ధరిత్రి దినోత్సవం సందర్భంగా మండలంలోని సూరంపేటలో రైతులతో కలిసి కాలుష్య నియంత్రణ ప్రతిజ్ఞ చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరు ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించాలని సూచించారు. ఫీల్డ్ ఫెసిలిటర్ పల్నాటి రాంబాబు, మోతే మనోహర్, నవయుగ సొసైటీ డైరెక్టర్ సూరం మాధవరెడ్డి, బీసీఐ రైతులు ఆదిరెడ్డి, రాజిరెడ్డి, ధర్మారెడ్డి, చంద్రారెడ్డి, కట్టయ్య, శ్రీలత పాల్గొన్నారు.

కంటి వైద్య శిబిరం ఏర్పాటు

కంటి చూపు చాలా ముఖ్యమైందని ప్రజ్వల్ రైతు ఉత్పత్తిదారుల సంఘం సీఈవో రాంమూర్తి అన్నారు. మండలంలోని గట్లకానిపర్తి, సూరంపేట గ్రామాల్లో సోమవారం ప్రజ్వల్ రైతు ఉత్పత్తిదారుల సంఘం ఆధ్వర్యంలో శరత్ మాక్స్ విజన్ సహకారంతో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించగా ఆయన పాల్గొన్నారు. కంటి సమస్యతో బాధపడుతున్న 110 మందికి ఉచిత పరీక్షలు నిర్వహించారు. తీవ్రమైన కంటిచూపు సమస్యతో బాధపడుతున్న 32 మందిని శస్త్రచికిత్స నిమిత్తం ఆస్పత్రికి రెఫర్ చేసినట్లు వైద్యులు తెలిపారు.

మరమ్మతుకు నోచుకోని చెక్‌డ్యాంలు

- నాలుగేళ్లు గడుస్తున్నా పట్టించుకోని వైనం
- నిర్లక్ష్యం వీడని అధికారులు
- సాగునీటికి తప్పని తిప్పలు

కమలాపూర్ : భారీ వర్షాలు కురిసిన ప్రతీసారి వాగులు పొంగుతూ వృథాగా పోతున్న నీటికి అడ్డుకట్ట వేసేందుకు మండలంలోని పలు వాగులపై 2017 సంవత్సరంలో రూ.14.45 కోట్లు వెచ్చించి ఎనిమిది చెక్‌డ్యాంలు నిర్మించారు. దీంతో తీవ్ర వర్షాభావ పరిస్థితుల్లోనూ చెక్‌డ్యాంలల్లో నీరు నిల్వ ఉండి భూగర్భ జలమట్టం పెరిగి మండల ప్రజలకు తాగు, సాగు నీటి ఇబ్బందులు తలెత్తకుండా చెక్‌డ్యాంలు దోహదపడ్డాయి. అయితే చెక్‌డ్యాంలు మరమ్మతు దశకు చేరుకోవడంతో ప్రస్తుతం తాగు, సాగు నీటి ఇబ్బందులు తలెత్తుతున్నాయి.

భారీ వర్షాలకు దెబ్బతిన్న చెక్‌డ్యాంలు..

2020 ఆగస్టులో కురిసిన భారీ వర్షాలకు వాగులు పొంగి ఉధృతంగా ప్రవహించాయి. వాగుల ఉధృతిని తట్టుకోలేక చెక్‌డ్యాంలు, చెక్‌డ్యాంలకు ఇరువైపులా నిర్మించిన కరకట్టలు తెగి కొట్టుకుపోయాయి. మండలంలోని మర్రిపల్లిగూడెం, నేరెళ్ల, అంబాల, గోపాల్‌పూర్ చెక్‌డ్యాంల కరకట్టలు వాగు ఉధృతికి దెబ్బతిని కొట్టుకు పోయాయి. అధికారులు మరమ్మతులు చేసేందుకు చెక్‌డ్యాంల పరిశీలన, పాలకులు సందర్శలు చేసినా నేటికీ ఫలితం మాత్రం శూన్యంగానే మిగింది.



మర్రిపల్లిగూడెంలో కొట్టుకుపోయిన చెక్‌డ్యాం(ఫైల్)



నేరెళ్లలో దెబ్బతిన్న చెక్‌డ్యాం

మరమ్మతులు ఏవీ..

భారీ వర్షాలకు దెబ్బతిన్న చెక్‌డ్యాంలకు మరమ్మతులు చేపట్టాల్సిన అధికారులు నాలుగేళ్లవుతున్నా ఇప్పటి వరకు చేపట్టలేదు. దీంతో కోట్లాది రూపాయలు వెచ్చించి నిర్మించిన చెక్‌డ్యాంలతో రైతులు, ప్రజలకు ఎలాంటి ప్రయోజనం లేకుండా నీరంతా వృథాగా ప్రవహిస్తోంది. ప్రస్తుత పరిస్థితుల్లో తాము సాగు చేసిన పంటలకు సరిపడా నీరందక పంటలు ఎండిపోతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం, అధికారులు పట్టించుకోవాలని రైతులు కోరుతున్నారు.

మరమ్మతులు చేపట్టాలి



భారీ వర్షాలతో వరద ప్రవాహం ఎక్కువగా రావడంతో నీటి ఉధృతికి తట్టుకోలేక చెక్‌డ్యాంల కరకట్టలు తెగిపోయాయని అధికారులు చెప్తున్నారు. కానీ కోట్లాది రూపాయలు వెచ్చించి నిర్మించిన చెక్‌డ్యాంలు నీటి ఉధృతిని తట్టుకునేలా నిర్మించాల్సిన కాంట్రాక్టర్లు నాసిరకంగా నిర్మించడంతోనే చెక్‌డ్యాంలు దెబ్బతిన్నాయి. ఇప్పటికైనా దెబ్బతిన్న చెక్‌డ్యాంలకు మరమ్మతులు చేపట్టాలి.

– కుక్కల సతీష్, అంబాల

నీళ్లన్నీ సముద్రం పాలవుతున్నాయి



చెక్‌డ్యాంల నిర్మాణంతో వాగుల్లో నీళ్లు నిల్వ ఉండి భూగర్భ జలమట్టం పెరిగిందని, ఎంత కరవు వచ్చినా సాగు, తాగు నీటికి ఇబ్బందులు ఉండదని సంబురపడ్డాం. కానీ భారీ వర్షాలకు చెక్‌డ్యాంలు దెబ్బతినడంతో ఆ సంబురమంతా ఆవిరైపోయింది. వాగు నీళ్లన్నీ వృథాగా పోతూ సముద్రంలో కలుస్తున్నాయి. చెక్‌డ్యాంలలో నీళ్లు లేక చేతికొచ్చే దశలో పంటలు ఎండిపోతున్నాయి. వెంటనే చెక్‌డ్యాంల మరమ్మతులు చేపట్టాలి.

– కొండం శ్రీనివాస్, ఎంపీటీసీ

ఘనంగా గ్రాడ్యుయేషన్ డే



ఐనవోలు : మండలంలోని ఒంటిమామిడిపల్లి ప్రభుత్వ పాఠశాలలో సోమవారం గ్రాడ్యుయేషన్ డే నిర్వహించారు. విద్యార్థుల కేరింతల నడుమ వేడుకలు ఉత్సాహంగా జరిగాయి. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు విద్యార్థులకు గ్రాడ్యుయేషన్ సర్టిఫికెట్లను అందించారు. అనంతరం విద్యార్థుల నృత్యాలు పలువురిని ఆకట్టుకున్నాయి.